క్లుప్తంగా

తీజ్ ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న తుల ఉమ, తదితరులు

కథలాపూర్: మండలంలోని గిరిజన తండాల్లో గురువారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గిరిజనులు సంప్రదాయ దుస్తుల్లో ఆట పాటలతో సందడి చేశారు. ఉత్సవాలకు జెడ్పీ మాజీ చైర్ పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత గోలి మోహన్, ఎన్ఆర్ఐ భైర దేవ్ యాదవ్, సర్పంచ్ సరిత, గిరిజనుల సంఘం మండలాధ్యక్షుడు రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

గొల్లపల్లి(పెగడపల్లి): మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ దత్తత గ్రామమైన ఆరవెల్లిలో జెండా ఆవిష్కరించారు. అనంతరం పలువురు పార్టీలో చేరారు. దోమలకుంటలో పలువురు బీజేపీలో చేరారు. సుద్దపల్లి, లింగాపూర్, పెగడపల్లి గ్రామాల్లో ఇటీవల పలువురు మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు కొమురెల్లి, అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం, బతికెపల్లి ఎంపీటీసీ అన సూర్య ఉన్నారు.

ప్రొసీడింగ్ పత్రాల అందజేత

కోరుట్ల రూరల్ : మండలంలోని సంగెం, నాగులపేట, గుమ్లాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులతో పాటు కుల సంఘాల అభివృద్ధి కోసం మంజూరైన నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ ఆయా గ్రామాల సర్పంచులు, కుల సంఘాల నాయకులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

22, 23న మండలస్థాయి క్రీడా ఎంపిక పోటీలు

గొల్లపల్లి: మండలస్థాయి పాఠశాలల క్రీడల ఎంపిక పోటీలు ఈనెల 22, 23 తేదీల్లో మల్లన్నపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి జమునాదేవి తెలిపారు. మరిన్ని వివరాలకు పీఈటీ భాస్కర్‌రెడ్డి 93966 14777 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కథలాపూర్: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు హవర్ బేస్‌పై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ గురువారం తెలిపారు. పీజీటీలో (గణితం, కెమిస్ట్రీ, జువాలజీ, సివిక్స్) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పీజీ, బీఎడ్ పూర్తిచేసిన వారు అర్హులని, ఈనెల 19వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నిరసన

ఇబ్రహీంపట్నం : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని కోరుతూ గురువారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ముందు భోజన విరామ సమయంలో సమగ్ర ఉద్యోగులు నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. సరిత, విజయలక్ష్మి, మమత, శ్వేత, సీఆర్పీలు రవీందర్, శివరాం, ఎమ్ఐఎస్ కార్తీక్, అశోక్, విజయ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మల్లాపూర్ : మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాటిపెల్లి రాజారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌ను పరిశీలించి ప్రిన్సిపాల్, హాస్టల్ విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో పర్మినెంట్ వార్డెన్ లేకపోవడంతో విద్యార్థినులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. మండల కేంద్రం నుంచి పాఠశాలకు వచ్చే రోడ్డు అధ్వాన్నంగా ఉందన్నారు. సమస్యలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం లక్పతిరెడ్డి, నాయకులు ఎండీ.రఫీ, మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల యాజమాన్య కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోర్తాడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దావు రజిత, గౌరవాధ్యక్షుడిగా గాడిపెల్లి తిరుమల్, ఉపాధ్యక్షురాలిగా మారంపెల్లి అపర్ణ, కార్యదర్శిగా బెజ్జంకి సతీశ్, సలహాదారుడిగా మొండయ్య ఎన్నికయ్యారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

గొల్లపల్లి(పెగడపల్లి): పెగడపల్లి జెడ్పీ పాఠశాలలో ఎన్నికల నిర్వహణపై హెచ్ఎం లింగంపల్లి లచ్చయ్య, ఉపాధ్యాయులు తిరుపతి ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ శ్రీనివాస్ పాఠశాలలో విద్యార్థులకు నమూనా ఎన్నికలు ప్రారంభించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయండి

- చౌలమద్ది–మారుతీనగర్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులపై నిర్లక్ష్యం
- దశాబ్దం క్రితం పనులు ప్రారంభం
- నేటికీ అసంపూర్తిగానే..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, రైతులు
- పట్టించుకోని అధికారులు


అసంపూర్తిగా హైలెవల్ బ్రిడ్జి పనులు

మెట్‌పల్లి రూరల్ : ఆ వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం సుమారు దశాబ్దకాలం క్రితం భూమిపూజ చేశారు. నేటికీ పనులు పూర్తికాకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్‌పల్లి మండలం చౌలమద్ది–మారుతీనగర్ మధ్యలోని పెద్దవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పంచాయతీ రాజ్ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి తోడు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పనులు ముందుకుసాగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ఇబ్బందులు లేకుండా చూడాలని, పంట పొలాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2012లో నాబార్డు నిధులతో..

చౌలమద్ది–మారుతీనగర్ మధ్యలోని పెద్దవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి జూన్ 2012లో నాబార్డు ద్వారా ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయగా ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పిల్లర్ల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు కొద్ది మేరకు స్లాబుల్ వేసి వదిలేశాడు. బ్రిడ్జి నిర్మాణానికి అంచనా వ్యయం సరిపోలేదని పనులు నిలిపివేయడంతో 2017 లో ప్రభుత్వం అదనంగా రూ.కోటి 50 లక్షలు మంజూరు చేసింది. దీంతో మరిన్ని పనులు చేయించిన కాంట్రాక్టర్ మళ్లీ పనులు నిలిపివేశాడు. మరోవైపు వర్షాకాలం కావడం, వాగులో నీటి ఉధృతి పెరగడంతో రైతులు ఇతర గ్రామాల మీదుగా పంట పొలాలకు వెళ్తున్నారు. చౌలమద్ది గ్రామస్తులకు చెందిన సుమారు 500 ఎకరాలకు పైగా పంట పొలాలు ఈ వాగు దాటాకే ఉన్నాయి. రైతులు నిత్యం పంటపొలాలకు వెళ్లాలంటే వేరే గ్రామాల మీదుగా వెళ్లాల్సి వస్తోందని సుమారు 3 నుంచి 4 కి.మీ దూరభారం పెరుగుతుందని చెబుతున్నారు. ఏటా చౌలమద్ది గ్రామస్తులు తలాకొంత డబ్బులు పోగుచేసి వాగుమధ్యలో నుంచి మెట్టులాగా తాత్కాలిక రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నా వర్షాలకు కొట్టుకుపోతుందని తెలుపుతున్నారు. గతంలో పలు కార్యక్రమాలకు హాజరైన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దృష్టికి రైతులు సమస్యను తీసుకెళ్లగా ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. అయినా ఇప్పటివరకు పనులు పూర్తికాలేదు.

గతంలో రైతుల ఆందోళన..

బ్రిడ్జి నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేయాలని రైతులు గతంలో వాగువద్ద ఆందోళన చేపట్టారు. ఏటా రూ.50 వేల నుంచి లక్షతో తాత్కాలిక రోడ్డు మార్గం వేసుకుంటున్నామని, వర్షాలతో వాగులో నీటి ప్రవాహం పెరిగి కొట్టుకుపోతోందని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

వేరే మార్గం గుండా వెళ్తున్నాం



నాకు మూడెకరాలు ఉంది. నిత్యం పొలానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. పెద్దవాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక వేరే మార్గం గుండా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. మా గ్రామం నుంచి సుమారు 3 కి.మీ మేర తిరిగి వెళ్తున్నాం. పనులు త్వరగా పూర్తిచేయాలి. –సంజీవ్‌రెడ్డి, రైతు, చౌలమద్ది

త్వరగా పూర్తిచేయాలి



నాకు పదెకరాలు ఉంది. పంట పొలానికి వెళ్లాలంటే చాలా అవస్థలు పడుతున్నాం. వాగు దాటాకే పంట పొలాలు ఉండడంతో పనులు త్వరగా పూర్తిచేస్తే పొలాలకు వెళ్లేందుకు అనువుగా ఉంటుంది. బ్రిడ్జి పనులు పూర్తయితే దూరభారం కూడా తగ్గుతుంది.

– పుదుకారం వెంకటేశ్, రైతు, చౌలమద్ది

రీటెండర్ ప్రక్రియ పూర్తయింది

గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిధులు సరిపోలేదనే కారణంతో పనులు నిలిపివేశాడు. దీంతో మళ్లీ రీటెండర్‌కు పిలిచాం. రీటెండర్ ప్రక్రియ పూర్తయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వాగులో నీరు చేరింది. నీటి ఉధృతి తగ్గిన తర్వాత పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– నిరంజన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ, మెట్‌పల్లి

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కోరుట్ల : పట్టణంలోని లారీ, వ్యాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. లారీ, వ్యాన్ అసోసియేషన్ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషిచేస్తున్నారన్నారు. అసోసియేషన్ కోసం స్థలం కేటాయించటంతో పాటు కమిటీ హాల్ నిర్మాణానికి రూ. 3 లక్షలు, 21వ వార్డు అభివృద్ధికి రూ.40 లక్షలు నిధులు కేటాయించారని కౌన్సిలర్ అన్వర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో లారీ, వ్యాన్ అసోసియేషన్ నాయకులు జాప భూమయ్య, వాజిద్, నర్సయ్య, లచ్చన్న, హైమద్, రెడ్డి, మజాల్, తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

ధర్మపురి : రానున్న ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ స్థానికుడైన గజ్జెల స్వామికి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. అంబేద్కర్ విగ్రహం నుంచి పటేల్ విగ్రహం వరకు పాదయాత్రగా వెళ్లారు. ప్రజలు స్థానికులను కోరుకుంటున్నారని అందుకు గజ్జెలస్వామికి టికెట్ కేటాయించాలని కోరుతూ రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు రాజేశం గౌడ్, గోపు అశోక్, కొమురయ్య, గంద్ర వెంకట్రావ్ తదితరులున్నారు.

4 నుంచి శత చండీయాగం

జగిత్యాల: నవంబర్ 4 నుంచి 9వ తేదీ వరకు పాటు పద్మనాయక కల్యాణ మండపంలో శత చండీయాగం నిర్వహిస్తున్నట్లు వేద పండితులు తెలిపారు. ప్రముఖ పౌరాణిక వేద పండితుడు బ్రహ్మ శ్రీ తిగుళ్ల విష్ణుశర్మ నిర్వహించే శత చండీ యాగం కోసం నిర్వాహకులు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. లోక కల్యాణార్థం కోసం చండీయాగానికి ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొనాలని కోరారు.

కొనసాగుతున్న 'గృహలక్ష్మి' సర్వే


రాయికల్ : సర్వే చేస్తున్న కమిషనర్ సంతోష్‌కుమార్


కథలాపూర్ : అంబారిపేటలో సర్వే చేస్తున్న అధికారులు

మల్లాపూర్ : మండలకేంద్రంతో పాటు అన్నిగ్రామాల్లో గృహలక్ష్మికి దరఖాస్తులు చేసుకోగా లబ్ధిదారుల కోసం సర్వే చేపట్టారు. సాతారంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎంపీడీవో జగదీశ్ సర్వేలో పాల్గొన్నారు. పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత, పంచాయతీ కార్యదర్శి వినోద్, వార్డుసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని అంబారిపేట, భూషణరావుపేటలో గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై మండలాధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలతో పాటు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఎంపీవో గంగాధర్, ఏపీఎం నరహరి, ఆర్ఐ నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

గోవిందారంలో..

కథలాపూర్: బీమారం మండలం గోవిందారంలో తహసీల్దార్ రవికిరణ్ సర్వే చేపట్టారు. పలు వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేందర్‌రావు, సర్పంచ్ కరండ్ల మధుకర్, ఎంపీటీసీ నెల్లుట్ల పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

హబ్సీపూర్, సంగంపల్లిలో ..

జగిత్యాలరూరల్: గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకం దోహదపడుతుందని సూపరింటెండెంట్ గంగాధర్ అన్నారు. మండలంలోని హబ్సీపూర్, సంగంపల్లిలో దరఖాస్తుదారుల ఇళ్లలో సర్వే చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఐ భూమయ్య, సర్పంచులు ఎంపీటీసీ చెవుల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని 7,9,10 వార్డుల్లో గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ సిబ్బంది దరఖాస్తులు పరిశీలించారు. కమిషనర్ సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

నిత్యావసరాలు అందజేత


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

ధర్మపురి : పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీనృసింహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా రెండు పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. గురువారం పట్టణంలోని తోట్లవాడకు చెందిన తరాల రాజయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా రూ.1500తోపాటు నెలరోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. కాశెట్టివాడకు చెందిన ఒంటరి మహిళ సత్తమ్మ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఇక్కడ పప్పుల శ్రీనివాస్, రంగు లక్ష్మీ నరహరి, జక్కు రవీందర్, సంగి శేఖర్, రంగ హరినాథ్, తదితరులున్నారు.

డప్పుల పంపిణీ

కొండగట్టు(చొప్పదండి) : కొడిమ్యాల మండల కేంద్రంలో జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 మంది డప్పు కళాకారులకు గురువారం మాజీ ఉపసర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్లపెల్లి మొండయ్య, మల్లేశం జితేందర్ మ్యాక రఘుపతి, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఓటుహక్కు ప్రాధాన్యంపై అవగాహన

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగులో కేజీబీవీ విద్యార్థులు గురువారం ఓటుహక్కు ప్రాధాన్యత గురించి గ్రామంలో ఇంటింటా అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు.

✦కరపత్రాల పంపిణీ

ఇబ్రహీంపట్నం : మండలంలోని వర్షకొండలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎలక్టోరల్ లిట్రసీ క్లబ్ సభ్యులు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు ప్రాముఖ్యతపై కరపత్రాలు పంపిణీ చేశారు. క్లబ్ నోడల్ అధికారి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉపసర్పంచ్ లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

✦గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రాయికల్: మండలంలోని సింగరావుపేటలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు అదనపు పశువైద్యాధికారి డాక్టర్ నరేశ్ తెలిపారు. రైతు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

✦ఓటరు నమోదుపై సమావేశం

కోరుట్ల: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో స్వీప్, ఓటర్ అవగాహన, 5కే రన్, ఎలక్షన్‌పై కళాశాల ప్రిన్సిపాల్స్, సెక్టోరల్ ఆఫీసర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. అధికారులు ఓటుహక్కు వినియోగం, తదితర అంశాలపై వివరించారు. ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ కిషన్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

✦పోలింగ్ కేంద్రాల సందర్శన

సారంగాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ తఫాజుల్లా హుసేన్ పరిశీలించారు. రేచపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్‌ను సర్పంచ్ జయ, వార్డు సభ్యుడు మహేశ్, సన్మానించారు. ఆర్ఐలు భాస్కర్‌రావు, కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

✦నిందితులను శిక్షించాలి

మెట్‌పల్లి : నిజామాబాద్ పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ ఎండీ రజాక్‌పై దాడికి పాల్పడిన నిందితులను గుర్తించి శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి విజయ్ అజాద్ డిమాండ్ చేశారు. గురువారం మెట్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు అజీం, ప్రణయ్, అబ్బు, వంశీ, అర్జున్, ప్రవీణ్ తదితరులు, పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



మల్లాపూర్ : అంతర్గత రహదారుల సమస్యలను పరిష్కరించాలని కొత్త దాంరాజుపల్లి గ్రామస్తులు తహసీల్దార్ వీర్‌సింగ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. దోబీఘాట్‌కు సమస్యను పరిష్కరించాలని, ఆ ప్రాంతంలో పొలాలు సాగుచేస్తున్న కొంతమంది రజకుల రాకపోకలకు అడ్డుపడుతున్నారన్నారు. పశువుల మంద నుంచి బోయినికుంటకు వెళ్లే రహదారిని కొందరు కబ్జా చేశారని, గ్రామస్తుల రాకపోకలతో పాటు పశువులను మేతకు తీసుకెళ్లేందుకు రోడ్డు ఇరుకుగా మారిందన్నారు. గ్రామపెద్దలు లింగారెడ్డి, సత్తయ్య, రాజారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, జమాల్, రాజేందర్, సాయిలు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- పార్టీలో చేరిన పలువురు నాయకులు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఒకటో వార్డు కౌన్సిలర్ కూసరి అనిల్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు రాజేంద్రప్రసాద్‌తో పాటు, పలువురు బీఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమిండ్ల శ్రీనివాస్, తాజొద్దీన్, అలిశెట్టి వేణు, సత్యం, రాజు, పవన్, ముకేశ్‌కన్నా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ శివారు గ్రామం కొత్తపేటను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కొత్తపేట వాసులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పాలనా సౌలభ్యం కోసం ప్రత్యేక గ్రామపంచాయతీని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వారి వెంట కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, నాయకులు పిప్పల గంగరాజం, స్వామి ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల: కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో పెంబట్లకు చెందిన కొందరు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ హయాంలోనే ఉచిత విద్యుత్, వ్యవసాయ పెండింగ్ బకాయిలు రద్దు చేయడం జరిగిందని, ఫీజు రియింబర్స్‌మెంట్, 104, 108, ఆడపిల్లల కోసం బాలికల సంరక్షణ పథకం, విత్తన రాయితీ, ఇలా ఎన్నో పథకాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గుండ మధు, విష్ణువర్ధన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్

కోరుట్ల: పట్టణంలోని కోరుట్ల పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ గుజ్జేటి వెంకటేశ్ ద లీడ్ ఆచార్య అవార్డు అందుకున్నారు. లీడ్ పబ్లిషర్స్ దేశ వ్యాప్తంగా లీడ్ స్కూల్స్ 2022–23 అకాడమిక్ ఇయర్‌కు సంబంధించి స్కూల్ స్థాయిలో ఉత్తమ ప్రాక్టీసింగ్, ఇంప్లిమెంటేషన్ ఆధారంగా ఇండియా లార్జెస్ట్ ప్రిన్సిపాల్ రికగ్నిజేషన్ అవార్డులో తెలంగాణ జోనల్ విభాగంలో వెంకటేశ్ విన్నర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందించారు.

న్యాయవాదుల నివాళి

జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది విజయ్‌కుమార్ బుధవారం గుండెపోటుతో మృతిచెందగా, గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపల్లి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణ రావు, కోశాధికారి కట్కం చంద్రమోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం


మల్యాల : ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు


మెట్‌పల్లి : ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి (కోరుట్ల): హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేశ్ అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని, దళితబంధు కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే చెందుతుందన్నారు. కోరుట్ల అసెంబ్లీ కన్వీనర్ సుఖేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్, ప్రభాకర్, నాయకులు రాజ్‌పాల్, నవీన్, సదాశివ్, రఘు, మహిళా నాయకురాలు సునీత, తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు అందించాలి

సారంగాపూర్: అర్హులకు దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, బీసీ బంధు అందించాలని కోరుతూ బీజేపీ నాయకులు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ మండల ఇన్‌చార్జి తిరుపతి, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల పార్టీ అధ్యక్షులు ఎండబెట్ల వరుణ్‌కుమార్, జనార్దన్, నాయకులు ఆడెపు రమేశ్, జలేందర్, దీటి వెంకటేశ్, మోదిగం మల్లేశ్, బొమ్మకంటి ప్రమోద్, వురుమల్ల పూర్ణచందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించి వినతిపత్రం అందజేశారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి వాసు, మహేశ్, పోతుగంటి శ్రీనివాస్, కౌన్సిలర్ మాడవేణి నరేశ్, ,బీజేపీ, బీజేవైఎం, కిసాన్‌మోర్చా నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: సీఎం కేసీఆర్ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలో బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో మారోసారి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఎంపీటీసీ రవి, బీజేపీ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, రాజు, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి సాతాల నిఖిల్, సందీప్, సైదులు, గంగాధర్, ముకుంద గంగాధర్, పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్ : హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వీర్‌సింగ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీ శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు గుయ్య శ్రీశైల మల్లేశ్‌యాదవ్, నాయకులు నరేందర్, బంటు మారుతి, రమేశ్‌రెడ్డి, భూమగౌడ్, పుప్పాల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జకరయ్య మాట్లాడుతూ.. దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ సభనాకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి ఉడత రాజు, సుంచు రణధీర్, ఉపాధ్యక్షులు పంతంగి వెంకటేశ్‌యాదవ్, ఇల్లెందుల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నీరేటి రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు తీగల శ్రీధర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు బోడ నవీన్ రెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.